# ౮ శ్రీ వేదవల్లి తాయారమ్మాళ్

క్రిన్నప్పనుబట్టి మహా దేవళం పెరిగినట్టే, చన్నప్పను బట్టి మహా పట్నం పెరిగిన గాథ కూడా ఒకటి వుంది. ఉందికాని ఆగాథ ఇప్పుడెవరికీ అక్కర్లేదు. ఇప్పుడు చన్నపట్నం అనే పేరుకన్న మెడ్రాసు అనేపేరే బాగా చలామణీ అవుతూ వుంది.

చన్నప్ప నెక్కడ వెదుకుదామన్నా ఆపట్నంలో కనబడడు. మతేమై పోయినాడు ? ఉత్తరాదికేసి కాశీ పోయినాడా ? దక్షిణాదికేసి రామేశ్వరం పోయినాడా ? స్టీమరెక్కి రంగూన్ పోయినాడా ? రైలెక్కి బొంబాయి పోయినాడా ?—ఇలాగ్గా ఆలోచన పోయింది, వోకానీ అద్దె యిచ్చి వోక్షణికం మదరాసు మరీనావోరే ఈజీఛైర్లో చతికిలబడ్డానో లేదో నాభావాంబర వీధిని—అలాగ్గా ఆలోచన పోయింది. ఆపళంగా ఏలా పైకిలేచి ప్రత్యక్షమైనాడో, చన్నప్ప సముద్ర మధ్య మంధరగిరిలా లేచి, తనకు మోకాలిబంటి నీరే సముద్రమన్నట్టు, నడిచి వచ్చేశాడు నా దగ్గరకు.

“నన్ను తల్చుకొంటున్నావు. ఎందుకు ?” అన్నాడు చన్నప్ప. అంటే చెప్పొద్దూ ఏదో జవాబు నేను ? “చన్నప్పా ! నీవు పెద్ద పెద్ద మేడలూ, పెద్ద పెద్ద మిద్దెలూ నిర్మించి, పేటలు వృద్ధి గావించి, విద్యా

లయాలు సమృద్ధిగా మొలిపించి, తారు రోడ్లను పూయించి, పెట్రోలు ఏ అంగలో పడితే ఆ అంగలోనే పోయించి, విద్యుద్దీపాలు ఏ వింగులో పడితే ఆ వింగులోనే మెఱపించి, ఇంతగా తంటాలు పడుతూవున్నా నీ పేరెవరూ ఈపట్నంలో చెప్పుకో రేంచేతనోయి! నీకొక్క శిలావిగ్రహం ఈ నగరంలో వెలిసింది కా దేంచేతనోయి ?'' అని అడిగాను.

అంటే అన్నాడు చన్నప్ప. "నాయనా! నీవూ ఐహిక భోగ పరాయణుడివిలాగే నా కంటికగ్గనబడుతూ వున్నావు. ఇంత దగ్గఱసా ఈ సముద్రపువారకు వచ్చి కూడా కేవలం కింది చూపేగాని పైచూపు సంపా దించుకో లేక పోయినావు'' అని ఎటకరించినట్లు మాటాడాడు. నేను ఈజీఛైరు వెంటనే దిగిపోయి యిసకమీద చతికిల బడ్డాను. చన్నప్ప నాప్రక్కనే కూర్చుని యిలాచెప్పేడు తన గాథ.—

"అసల్లో నేను బాగా లావుగా వుండేవాణ్ణి, మంచి భోజనప్రియుణ్ణి, భేషైన సంపాదన పరుణ్ణి, ఇంకా, ఇంకా చెప్పొస్తే అఖిల విద్యా విశారదుణ్ణి, సకల గుణాభి రాముణ్ణి, ఇలా రెచ్చిపోతూ వుండగా ఓపొద్దు చటక్కున నాకళ్ళు పోయివూరుకున్నాయి. లోకమంతా "అంతే కావాలి! మదాంధుడికి కళ్లూపోక వొళ్ళూ తియ్యక, వొళ్లు టాకీగా ఎంతకాలం నడుస్తుంది ?'' అని అనుకోసాగారు. కర్ణా కర్ణిగా వారి యూసు నా చెవిని సోకింది. సోకడం ఏమిటి ? అనుభవానికి వచ్చేసింది. భాగ్యం పోయింది. బట్ట పోయింది. వీధులంట కొఱగాని వాణ్ణయి, గంజి వుందా నంజు వుందా అని అడుక్కోవలసి వచ్చింద. నేనొక్కణ్ణి అవితే ఏలాగన్నా యేడవగలను. ఇంట్లో ఇల్లాలు! అది యిల్లు విడిచి యీవలకు రాన నీది. ఇంట్లోకి తీసుకొచ్చి తన మొగాన్ని అన్నీ పెడితే ఎంత పని

అయినా చేస్తాను అనీది అది. దాన్ని నట్టింట ఆలామాడబెట్టి, నేను వీధిలో చెట్టు నీడను కూర్చుంటేమాత్రం కూడికా అది?

అంచేత అది పని కాదనుకొని, దానితో ఒక సమయం చేసుకోవాలనుకొని, ఇలా అన్నాను. "మనం వొకరి యింటి దగ్గఱకు వెళ్ళి కూర్చోవద్దు. ఈవూళ్ళో పార్ధసారధి స్వామివారి గుడివున్నదే అక్కడకు వెళ్ళి ఆ గుడి ముందు గుడ్డ పరచుకొని కూర్చుందాం. వచ్చీపోయే అమ్మలక్కలు వేసే డబ్బులూ దమ్మిడీలు నీకూ నాకూ తిండికి సరిపోతవి" అన్నాను. అంటే అది — ఆ — నా — పెండ్లాం — పక్కున నవ్వి — "మంచి ఆలోచనే సెప్పారు! మునుపూ ముందూ మనం గుళ్ళోకి వెళ్ళి గుమికీలూ కుమ్ములూ తిన్నవి చాలకా యిప్పుడు మళ్ళీ ఆదరికి నన్ను తీసుకుని వెడతామనడం! మంచి మొగాళ్ళే మీరు!" అని అంది. "గుడీ, దేవుడూ అంటే నీకటువంటి భక్తి వుంది కనుకనే మనం ఇలా అయినాం" అని లోలో అనుకొని, దాన్ని మఱేం అనక, ఇంటనే అట్టే పెట్టి, నేను వొంటిగా నా కఱ్ఱతో తడుముకుంటూ, తోసుకుంటూ, తిరువళిక్కేణి శ్రీ పార్ధసారధిస్వామివారి ఆలయ ప్రాంగణానికిం బోయి అక్కడ బట్ట పఱచు కూర్చున్నా.

కూర్చుంటే నా బట్టలో భక్తులు పడేసిన రూకలు, రూపాయలు, కాసులు, మొహిరీలు, ఠంగు ఠంగుమని పడి నన్ను పరవశుణ్ణి చేసి పారేశాయి. కొంత సేపైనాక అవన్నీ యింటికి మూట కట్టి పట్టుకువెళ్ళి మా ఆవిడ ముందు పెడితినిగదా! అదిల్లా మూట నొక్కి నోరు నొక్కుకొని — ఇవేం రూకలు! ఇవేం మొహిరీలు! జలగల్లాగు మెత్తగా వుంటాయా రూకలూ మొహిరీలూ?— అంది. అంటే విప్పిచూడు అన్నాను. అంటే చూచి — "పువ్వులండీ! ఇవన్నీ పువ్వులండీ!

పువ్వులు తిండి కెలా పనికి వస్తాయండీ ! అవతల పారబోయండి'' అంది. అంటే ''పోనీ వాసన చూచుకుందాం. పువ్వులైతే మాత్రం పనికి రావుటే?'' అన్నాను నేను. అంటే అది ''ముందు ఆకలి తీరాలి ! నాకు చాలా ఆకలవుతోంది.'' అని ఆ పువ్వులన్నీ వీధిలో, చేటతో దుమ్మెత్తి పారబోసి నట్టు, పారబోసి పూరుకుంది. నేనూ అదీ కూడా ఆ రాత్రి వుపవాసమే. ఒక్క పువ్వూ నన్ను వాసన చూణ్ణిచ్చింది కాదు. తాను వాసన చూచింది లేదు. తెల్లారిపోయింది.

మర్నాటి మాట ! నిరాశ ఎక్కువ కాఁజొచ్చింది నా హృదయ కోశంలో. అయినా ఇదంతా ఏదో మాయగా తోస్తుంది, గుళ్ళో వాళ్ళు నా బట్టలో పడేసినప్పుడు పువ్వులైతే అవి రంగు రంగు మంటవా ? ఇందలి సత్య మేమిటో తెలిసికోవాలి అని, మర్నాడు ప్రక్కన కూర్చున్న కళ్ళున్న మామూలు బిచ్చగాణ్ణి వొక్కణ్ణి ''కనిపెట్టు నాయనా! కాస్తంత! వాళ్ళూ వీళ్ళూ నా గుడ్డలో పడేసేవి రాళ్ళో రప్పలో రూకలో నూకలో'' అని ప్రోత్సహించాను. వాడు చూచి చూచి వెఱ్ఱిగా ''రూకలేనోయి ! కాసులేనోయి !'' అని నా చెవిలో వూదేడు. 'బాగుంది' అని విఱ్ఱవీగుతూ మళ్ళీ అవన్నీ మూటగట్టుకొని క్రిందటి రేత్రిలాగే పట్టుకువెళ్ళి ఆడదాని ముందుబెట్టి ''ఇవి మార్చి పప్పు, ఉప్పు, అన్నీ సంబాళించుకురా !'' అన్నాను. అది మళ్ళీ యధాప్రకారంగా మూటెత్తి నేలనుపెడుతూ ''చప్పుడు లేదు. ఇవాళా చప్పుడు లేదు. మీ మూట మండిపోయిరి !'' అంది. అంటే ''విప్పిచూడు ! విప్పిచూడకుండా పేలకు !'' అన్నా న్నేను. అంటే విప్పిచూచిందై—''ఇవ్వాళా పువ్వులే తగలేశావు !'' అంది. అంటే ''మనకు ప్రాప్తం పువ్వులే కామోసు ! పువ్వుల్ని ఏం

చెయ్యాలో ఆ పనిచేసి చూదాం! మూచూదాం'' అన్నాను. ''మూచూడ్డం కాదు. అగ్గి ముట్టించి ధూపం ఎగబీల్చు!'' అంటూ పట్టుకుపోయి పెరట్లో గోతిలో కప్పెట్టి చక్కావచ్చింది. రెండో రాత్రి కూడా ఆ సంపాదించి తెచ్చిన వాటిలో వొక్క పువ్వూ నేనుగాని అదిగాని మూర్కోలేదు. పేర్కోలేదు.

మూడోరోజు వుదయం ఇఖ నేను బడ్డ వ్యాధికి మందే లేదనిపించింది. అయినప్పటికీ ఏదో మహత్తుగా వుంది ఈ మహా విపత్తు అని తలపోసి యథాప్రకారంగా నా నమ్మకం కొద్దీ కోవెల గుమ్మంకాడ మళ్ళీ వస్త్రం పరుచుకు కూర్చున్నాను. కూర్చుని ''అమ్మా! తల్లీ! తండ్రీ! అప్పా! నాడెంగా నాణ్యాలూ తండులాలూ పడెయ్యండి, మరువం దమనం, మల్లే, చేమంతీ, జాజీ, రోజా, అవి నాకు వద్దు. నాడెంగా నాణ్యాలూ తండులాలూ పడెయ్యండి'' అని దాతల్ని హెచ్చరించాను. అంటే వాళ్ళంతా కూడా ''ఓయి! వెంబరివిత్తా! కొప్పులో పువ్వులు, గుప్పెట్లో పువ్వులు మావి మావే, మీవి మీవే, మాదీమీదీ అయ్యేది నాణ్యాల మారకమొక్కటేనోయీ'' అని చిల్లఱ గిరాటేశారు. ''బాబూ బ్రతికానురా నేను'' అని అదంతా మూట గట్టుకొని తిరిగి యింటికి వెళ్లి నేనే మూట విప్పి భార్యముందు పోసి నాచేతుల్తో లెక్కెడుతూ వొక్కొక్కటే దాని చేతులో పోశాను. పోస్తూవుంటే ''ఇదేందిరా! నీచేతిలో నాణెంగావుండి నాచేతిలోకి వచ్చేసరికి పూవైపోతూవుంది ప్రతిదీ! అని వో పువ్వు వాసన చూచింది. కడుపు నిండినట్టు గర్రున త్రేంచింది. ఓ పువ్వు నాముక్కు దగ్గఱెట్టింది. నేను దానికంటె ఎక్కువగా గర్రున త్రేంచాను. ఓ పువ్వు అది తల్లో పెట్టుకుంది. ఇల్లంతా వెలుగై

పోయింది. ఓ పువ్వు నామీదికి విసిరింది అది. నాకళ్ళకు మళ్లీ ఎక్కడ్లేని చూపు వచ్చేసింది.

అపాళంగా ఆ చీకటి రేత్రే నాతలోదరి వీధిలోకీ పెరట్లోకీ పరుగెత్తుకెళ్ళి "నిన్నా మొన్నా మనం పారేసిన పువ్వులెక్కడ వున్నాయో చూపెట్టండీ! మీకు జ్ఞాపకం వుంటేను" అని గట్టిగా అఱవడం ప్రారంభించింది.

ఊళ్లో వాళ్ళంతా చేరువకొచ్చి "ఏంవస్తువు పోయింది ఆలా వెమకుతున్నారు." అని అడిగినారు. మేమిద్దఱం మాట్లాడకపోతే విసుపోయి "చన్నప్పా! చెప్పు!" అన్నారు—ఏమని చెప్పేది?— వేదవల్లి పైకెదిగి ఆకాశాన్ని రాత్రులందు పువ్వులు పూస్తూవుందట కాదూ?—" అన్నాను.

అందఱూకూడా "ఎప్పట్నుంచి? ఎప్పట్నుంచి?" అని ప్రశ్నించడమే! చెప్పడానికి నాకూ నాభార్యకూ కూడా సిగ్గయిపోయింది. గత రాత్రినుంచి అని చెప్పనా? గత రాత్రి కింకా వెనుకటి రాత్రినుంచి అని చెప్పనా?

చన్నప్పకు పేరు ఎందుకు? చన్నప్పకు శిలా విగ్రహమెందుకు? మఱెప్పట్నుంచి అనే చర్చ ఆలా కట్టిపెట్టి, ఆకాశానివి చుక్కలో పువ్వులో తెలియక్కొట్టు మిట్టాడుతూ వున్నాను ఇప్పటికీ నేను" అని అన్నాడు.

"చన్నప్పా! సెలవు" అన్నాను. లేందే అతను అక్కడ నాముందు! నేను వదలి వేసిన ఈజీఛైర్? అదీలేదు! అక్కడ!

---

రచన 19-2-1937 | స్ఫురణ తిరువళిక్కేణి పార్థసారథి | తొలిప్రకటనము "ఆంధ్రభూమి"లో